

# పొరుగింటి మీనాక్షమ్మ

వసుంధర

నేను మునిమాణిక్యంగారి దాంపత్యోపనిషత్తు చదవలేదు. ఎందుకంటే ఆ అవసరం నాకు కనిపించలేదు. భార్యవద్ద ఎలా మసలుకోవాలో నేను వివాహానికి ముందే నిర్ణయించేసుకున్నాను. వివాహానంతరం ఆ ప్రకారమే నడుచుకుని ఆమె మన్ననకు పాత్రుడనయ్యాను.

నేను నడుచుకొన్న విధానమంటారా- ఆమెను ఒసేవ్ అని కాకుండా, పేరుతో పిలవడం; నేను సంపాదించేదంతా ఆమె చేతుల్లోనే పోసి - నా కష్టాలన్నీ ఏకరువు పెట్టుకోడం; ఆమెను నా అర్ధ శరీరంగా భావించి- ఆఫీసుకూ, అభ్యంతర ప్రదేశాలకూ తప్ప మరెక్కడికెళ్ళినా కూడా తీసుకెళ్లడం;ఆమెతో అవసరమున్నప్పుడు కోపంగా ఉండడమూ, అవసరంలేనప్పుడు అభిమానంగా మాట్లాడడమూ, ఆమెదగ్గర లేనప్పుడు విరహంతో పేజీలు నింపి పోస్టుచేయడం ఇలా చాలా ఉన్నాయి. ఇవన్నీ ఆమెకు నామీద గౌరవాన్నీ, అభిమానాన్నీ పెంచగా- నా జీవితం ఆమె ద్వారా స్వర్గధామమైంది.

మేమిలా చిలకాగోరింకల్లా, చూడ ముచ్చటగా కాపురం చేస్తూంటే చాలామంది ఎదురుగా మెచ్చుకుని చాటుగా అసూయపడ్డారు. నావల్ల కొంతమంది భర్తలు ఇరుకునకూడా పడ్డారు. నేనొక ఆదర్శపతిగా పేరుపొందాను. మాది ఆదర్శ దాంపత్యంగా విలసిల్లుతోంది. అందుకు తగ్గట్టుగానే మాకో అమ్మాయీ, అబ్బాయీను.

ఇదిలా ఉండగా మా పొరుగింట్లో ఓ మీనాక్షమ్మగారు దిగింది. దిగిన వారం రోజులు బాగానే ఉందికానీ- అనంతరం మా కష్టాలు ప్రారంభమయ్యాయి.

నాకు తెలిసినంతవరకూ మీనాక్షమ్మగారి భర్త 'నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు, చల్లని చూపులవాడు' కానీ మా ఆవిడకు ఆయన్ను గురించి అంతకంటే ఎక్కువ తెలిశాయి. కారణం- నాకు ఆయనతో పరిచయం. కానీ మా ఆవిడకు మీనాక్షమ్మగారితో పరిచయం. భర్తను గురించిన వివరాలు- భర్తకంటే కూడా ఆ భర్త- భార్యకు తెలుస్తాయి గదా!

మీనాక్షమ్మగారి భర్త - భార్యకు అర్ధ శరీరాన్ని కాదుట - పూర్తి శరీరాన్నిచ్చేశాడుట. ఆవిడను అర్ధాంగి అనికాక పూర్ణాంగి అని పిలుస్తాట్ట. "ఆవిడ కాస్త

లావుగదా మరి - అందుకేమో" అని నేనంటే- "మీరంతే- అన్నింటికీ అలాగే అంటారు. ఆయనకి భార్యే జీవనసర్వస్వం టండీ" అంది మా ఆవిడ. అలా అంటు న్నప్పుడు శ్రీమతి కళ్ళల్లో మొదటిసారిగా కొంత అసంతృప్తిని చూశాను.

ఆ అసంతృప్తి నన్ను బాధించింది. ఆదర్శపతిగా భాసిల్లుతున్నానన్న నా అహం కారాన్ని దెబ్బకొట్టింది. "రేపట్నించీ టానిక్కు లిప్పిస్తాను. నువ్వు కూడా పూర్ణాంగివే అవుదువుగాని-" అన్నాను. శ్రీమతి మూతి మూడు వంకర్లు తిప్పింది.

మర్నాడు శ్రీమతి పేరంటానికి వెళ్ళింది, పిడుగులాంటి రెండోవాణ్ణి నా మీద వదిలేసి- పెద్దదాన్ని నడిపించుకుంటూ హాయిగా వెళ్ళిపోయింది. సాయంత్రం అయిదున్నరకు వెళ్ళిన మనిషి మళ్ళీ రాత్రి ఎనిమిది దాటిన తర్వాత దర్శన మిచ్చింది. ఈలోగా మా పిడుగు నన్ను ముప్పుతిప్పలూ పెట్టి మూడు చేరువుల నీళ్ళు తాగించగా- నేను ఆయాసంతో మంచంమీద పడిపోయి నిస్సహాయుడనై వాడుచేసే దారుణ నాశనకాండను తిలకిస్తూ ఊరుకున్నాను.

శ్రీమతిని చూస్తూనే నాలో మళ్ళీ ఎక్కడలేని బలమూ పుంజుకోగా ఒక్క సారి విరుచుకుపడిపోయాను. పేరంటాని కని వెళ్ళి ఇంతసేపా? అన్నాను. పిల్లా డిక్కడున్నాడన్న జ్ఞానముండక్కరలేదా అన్నాను. ఇంకా నోటికొచ్చినవి చాలా అని అసలు నీ బుద్ధే ఇంత అని కొన్ని పాత ఉదాహరణలను కూడా ఇచ్చాను. ఇంకా అందునుగానీ పిల్లాణ్ణాడించలేక నీరసమొచ్చింది - ముందు వంటకానియ్యమని కూడా అన్నాను.

నన్ను పూర్తిగా వాగనిచ్చి శ్రీమతి అంది- "నీరసమొచ్చి మాట్లాడలేనంటు న్నారు కాబట్టి ముందా మాటమీద నిలబడి- నేను చెప్పినవన్నీ మాట్లాడకుండా వినండి. పేరంటానికి వెళ్ళేటప్పుడు ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఎలా వెళ్ళను? మీ పుత్రికా రత్నం మూడ్‌నిబట్టి నడుస్తుంది. అది ఎత్తుకోమంటే ఎత్తుకు తీరవలసిందేగదా- పేరంటానికి వెళ్ళకుండా ఉండాలి కానీ వెళ్ళేక తిరిగి రావడమన్నది నా చేతిలో ఉన్న విషయం కాదుగదా. అప్పటికీ రెండు మూడుసార్లననే అన్నాను- కుర్రాడితో ఆయనేం ఇబ్బంది పడుతున్నారో ఏమో నని. అంటే మీనాక్షమ్మగారు తెలుసుగదా మీకు- ఆవిడ నవ్వేసి- మావాడికంటె అల్లరివాడు కాదుగదా మీవాడు. మా ఆయనమాత్రం భరించడంలేదా, అయినా నేను కూర్చోలేదా అనేసింది. ఉన్న ఒక్క కొడుకునీ ఎంచక్కా ఇంటిదగ్గర వదిలేసి చేతులూపుకుంటూ పేరంటాని కొచ్చిం దావిడ- ఒక్కపిల్లే ఉన్నప్పుడు ఎప్పుడైనా పేరంటానికి ఒక్కత్తినీ వెళ్ళనిచ్చారా నన్ను. ఇద్దరు పిల్లలుంటే మీనాక్షమ్మగారి మొగుడయితే ఇద్దర్నీ ఇంటిదగ్గరే ఉంచేసు కునేవాడు." శ్రీమతి ఒక్కసారి గుక్క తిప్పుకుని మళ్ళీ మొదలెట్టింది. "వచ్చి ఎనిమిది గంటలకి తిరిగొస్తే, వంట చేయమని తొందరపెడుతున్నారు మీరు. మీనాక్షమ్మగారూ నేనూ పేరంటంనుంచి బయటకు వచ్చేశామా. నేను తిన్నగా ఇంటికొచ్చేసేను కానీ ఆవిడ ఇంకా పెత్తనాలు చేస్తోంది. ప్రస్తుతం ఆవిడ రమణి గారింట్లో ఉంది. ఎందుకంటే

ఆవిడ మొగుడు పిల్లాణ్ణి చూసే బాధ్యతతో బాటు, వంటచేసే బాధ్యతను కూడా స్వీకరించాడట. ఆవిడ మరీ ఆలశ్యంగా వచ్చే మాటయితే తన వాటా తను తినేసి పడుకుంటానని కూడా అన్నాడట. ఎందుకూ మీరూ ఉన్నారు."

అన్నమాటమీద నిలబడి, అన్నం తినేవరకూ నేనేం మాట్లాడలేదు. కానీ నన్నో ఆశ్చర్యం బాధిస్తోంది. బాబిగాణ్ణి ఆడించేసరికే నీరసమొచ్చి సోలిపోయాను నేను. మీనాక్షమ్మగారి మొగుడు, తన కొడుకుని చూసుకుంటూ వంట ఎలా చేయగలిగాడు? బాగా ఆలోచించినమీదట సమాధానం తట్టకపోలేదు కానీ, అన్న మాటకు కట్టుబడడంకోసం అన్నం తినే వరకూ ఆగవలసి వచ్చింది.

కూరా, అన్నం తిన్నాక నెమ్మదిగా అన్నాను "మీనాక్షమ్మగారికి పెత్తనాలు అలవాటుగదా. సెలవురోజుల్లో కూడా ఆవిడ కొడుకు నొదిలేసి పెత్తనానికి వెడుతుందని నువ్వే ఒకసారి అన్నట్టు గుర్తు. అందువల్ల ఆవిడ భర్తకు కొడుకును చూసుకుంటూ పనులు చేసుకోవడమన్నది ఒక్కసారిగా నేర్చుకున్న విద్య కాక, క్రమంగా అలవడినదై ఉంటుంది. అందువల్ల రేపట్నించీ నువ్వు కూడా ఒక్కత్తివీ పెత్తనాలకు వెళ్ళు. నేను పిల్లల్ని చూసుకుంటాను. ఓ నెల్నాళ్ళలో వంట చేయలేకపోను."

"చాల్లెండి" అంది శ్రీమతి "పెత్తనాల మీద నాకు ఇంటరెస్టులేదనీ, మిమ్మల్ని వదిలి రోజూ వెళ్ళననేగదా మీ ధీమా. అయినా పెళ్ళాంమీద జాలి అనేది ఉండాలికానీ, ఈమాత్రం దానికి అభ్యాసం కావాలా. మినాక్షమ్మగారు రాత్రినిద్రపోతె మరి లేవదట. మధ్యలో కొడుక్కి పాలు పట్టించవలసిన బాధ్యత తండ్రిదేనట."

"మరి మనవాడికి పోత పాలు కాదు గదా, ఈ విషయంలో నేనెలా సహాయం చేసేదీ" అన్నాను.

"చెప్పేది వినకుండా ప్రతిదానికీ అలా విపరీతార్థాలు తీస్తారెందుకండీ" అంటూ విసుక్కుంది శ్రీమతి. "ఆవిడ ఉదయం లేచేసరికి ఆయన కాఫీ కలిపేసి తను త్రాగేసి ఆవిడ మటుక్కు ఫ్లాస్కులో పోసి వుంచేస్తాడట. ఎందుకంటే భార్యాభర్త లిద్దరికీ లేవగానే కాఫీ కావాలి. ఎటొచ్చీ అయిదున్నరకే లేవడం ఆయన కలవాటు. ఏడుదాటితే కానీ ఆవిడకు మెలకువరాదు. లేవగానే భర్త కలిపిన కాఫీ తాగాకనే ఆవిడ వరుసగా ఇంటి పనులన్నీ మొదలెడుతుందిట. అదృష్టం చూడండి, పెళ్ళయినా ఆవిడ తన పాత అలవాట్లను మానుకోనవసరం లేక పోయింది. నా సంగతి చూడండి, ముఖ్యంగా నిద్ర విషయంలో "

"నిన్ను గురించి నాకు బాగా తెలిసింది వివాహమైన మొదటి రాత్రి నాడేగదా. ఆ అనుభవాన్నిబట్టి అష్టై నిద్రపోని మనిషి వనుకున్నాను నేను" అన్నాను.

నా మాట అనుకున్న ఫలితాన్ని సాధించింది. "ఎప్పుడూ మీకు అదే దృష్టి—" అంటూ సిగ్గుపడింది శ్రీమతి.


ఈ విషయంలో మీనాక్షమ్మగారి ఉదాహరణ లేవీ ఇవ్వకపోవడం అప్పటికి నా అదృష్టం. అదృష్టం సంగతలాగుంచితే అప్పుడే నేను ప్రమాదాన్ని పసిగట్ట వలసింది. కానీ అలా జరగలేదు. రెండు

మూడ్రోజుల అనంతరం శ్రీమతి వార్త మోసుకొచ్చింది "ఇది 'విన్నారా'?" అంటూ.

"ఆ ఇది ఏదో తెలిస్తే విన్నదీ లేనిదీ చెబుతాను" అన్నాను విసుగ్గా.

చెప్పింది శ్రీమతి. మీనాక్షమ్మగారి భర్త తనే స్వయంగా చాకలిపద్దు వేస్తాట్ట. ఎంత పకడ్బందీగా వేస్తాడంటే—తెల్లటి బట్టలకు కూడా పద్దులో ఏవో గుర్తులు పెట్టుకుంటాడట. ఆ కారణంగా ఆవిడ కాపురానికి వచ్చేక ఇంతవరకూ ఎన్నడూ ఒక జేబురుమాలు కూడా పద్దులో తేడా రాలేదట.

ఈ వార్త మా శ్రీమతి మోసుకురావడానికి కారణం లేకపోలేదు. నేను కొంచెం పరధ్యానం మనిషిని. ఏదో ఆలోచిస్తూ ఏదో పని చేస్తూంటాను. అందువల్ల అనేక తప్పులు చేశాను నేను. చాలా తప్పులు శ్రీమతి క్షమించిందికానీ చాకలిపద్దు విషయంలో మాత్రం క్షమించలేదు. ఒకసారి నేను వేసిన చాకలిపద్దు ప్రకారం మా శ్రీమతివి రెండే రవికలు రావాలి. కానీ వాడు ఆరు తెచ్చాడు. ఆరూ తనవేనని మా శ్రీమతి బట్టలను చూసి గుర్తుపట్టింది. నా తప్పిదంవల్ల వాటిని స్వంతం చేసుకోడానికి శ్రీమతి చాకలితో కాసేపు వాదించవలసి వచ్చింది. మరోసారి పద్దు ప్రకారం నావి ఆరు బనీన్లు రావాలి—కానీ మూడే వచ్చాయి. చాకలివాడు ఇంతే ఉన్నాయి మొర్రో అన్నాడు. వాడి గోలలో అర్థం లేకపోలేదు. నాకున్నవి అప్పటికి సరిగ్గా అయిదు బనీన్లు. ఒకటి తొడుక్కున్నాను. ఒకటి పెట్లో ఉంది. అంత కచ్చితంగా బనీన్ల లెక్క



"అరె! ఉన్నట్టుండి మన పడవ భలే స్పీడుగా పోతోందే?!"

ఎలా తెలుసుంటే—నెల్లాళ్ళ క్రితం ఎవడో ప్లాస్టిక్ సామాన్లవాడొస్తే-శ్రీమతి కళ్ళకి ఇంట్లో ఉన్న నా బనీన్లన్నీ పాతవిగా ఆనాయి. తొడుక్కున్నది మిగలగా మిగతావన్నీ ప్లాస్టిక్ సామాన్లవాడి పరమయ్యాయి. (అప్పుడు దురదృష్టవశాత్తూ మా చాకలి ఊళ్ళో లేకపోవడం వల్ల మాసిన బట్టలన్నీ ఇంట్లోనే ఉన్నాయి) అందువల్ల ఆ రోజు సాయంత్రమే షాపుకి పరుగెత్తి ఓ నాలుగు బనీన్లు కొనుక్కోవలసి వచ్చింది.

ఇంతకీ నాకున్నవి అయిదే బనీన్లయినప్పుడు—పద్దులో ఆరెలాగుంటాయని చాకలివాడితో తర్కించి బట్టలు సరిగానే వచ్చినట్లు తేల్చాను. చాకలివాడు వెళ్ళిపోయాక శ్రీమతి నా తెలివితక్కువతనాన్ని ఏకేసింది. పద్దు సరిగా వేయకపోవడం ఒక తప్పయితే—చాకలాడి ముందా విషయాన్నంగీకరించడం ఇంకా పెద్ద తప్పట. శ్రీమతి చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. చాకలి నా పద్దుకు అతీతుడై బట్టలు తేవడం ప్రారంభించాడు. ఫలితంగా గృహిణిగా తనకున్న


బాధ్యతల్లో చాకలి పద్దును కూడా చేర్చుకోవలసి వచ్చింది శ్రీమతి.

ఈ మీనాక్షమ్మగారి మొగుడు అసాధ్యుడిలాగున్నాడు. భార్య మన్ననకు పాత్రుడైనవాడు నా దృష్టిలో అసాధ్యుడే! అయితే అలా మన్ననకు పాత్రుడు కావడానికి అతను చేసే కృషికూడా సామాన్యమైనదికాదు. అతన్ని గురించి ఆరోజే కొద్దిగా ఆలోచించాను. నా ధర్మపత్ని స్థానాన్ని అతడాక్రమిస్తున్నట్లు నాకు తోచింది. అయితే నేనేం చేయాలి?

ఆ రోజుకి కొద్దిగా ఆలోచించినా ఆ విషయాన్ని నేనంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ క్రమంగా సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం కనబడింది.

వారం రోజులు తిరక్కుండా మీనాక్షమ్మ మొగుడిలో వున్న అనేక సుగుణాల వివరాలు మా శ్రీమతి సంపాదించింది. అందుకోసం మా శ్రీమతి పడ్డ కష్టమేమీ లేదు. మీనాక్షమ్మగారే స్వయంగా ఆమె చెవిన వేసింది.

మీనాక్షమ్మ మొగుడు వాసన చూసి కూరలు లేతవో, ముదరవో చెప్పగలడట. దేనికీ ఎన్నడూ కోపగించుకోవడమన్నది ఎరుగడట. ఈ ఓరిమి గుణం వల్లనో ఏమో అతడనేక విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాడట—వాటిల్లో వడ్రంగంకూడా ఉంది. దేవదారు పెట్టెల సహాయంతో అతడు చేసిన అలమారాను తలచుకున్నప్పుడల్లా శ్రీమతి పరవశించిపోతూంటుంది. అంతేకాదు—అతనుండే క్వార్టర్లో బాత్‌రూమ్ తలుపులు పాడైపోతే—దేవదారు పెట్టె చెక్కలతో అత



"ఇందుకే మనిద్దరి మధ్యా విడాకులు తప్పనిసరి అంటున్నాను!"

నొక తలుపును తాత్కాలిక ప్రయోజనార్థం తయారుచేశాడు. ఇంట్లో అన్ని తలుపుల్లోకీ అతను చేసిందే బాగుందిట.

"అవును మరి — గవర్నమెంటు క్వార్టర్సు కదా—తలుపులన్నీ నాసిరకంగానే ఉంటాయి" అన్నాను అమాయకంగా శ్రీమతి ఉద్దేశ్యాన్ని గ్రహించనివాడనై. నా అమాయకత్వాని కామె అసూయ అని పేరు పెట్టేక అసలు విషయం అర్థమైంది.

"అసూయ నా కెందుకూ? నేనూ ఓ తలుపు తయారుచేస్తే-ఆ తలుపు ఆయన చేసిన తలుపుకంటే బాగుండకపోతే— అప్పుడు కలగాలి అసూయ— " అని ఇంకా ఏదో అనబోతూండగా "చాల్లెండి-తలుపు చేయడంకూడాను—" అనేసింది శ్రీమతి.

నాకొంచెం ఉడుకుమోత్తనం రాగా "బాగుంది ఎవరికొచ్చే విద్యలు వారికొస్తాయి. పోనీ మీనాక్షమ్మగారి మొగుణ్ణో కధ రాయమను చూస్తాను" అన్నాను.

శ్రీమతి అనవసరంగా నవ్వింది."ఏం

చెప్పారండీ—కథలు రాయడం కూడా ఒక విద్యేనా? పనీపాటూ లేనివాళ్ళే కథలు రాస్తారు. రోజూ ఓ గంట మీరు పిల్లల్ని చూశారంటే వారం రోజుల్లో నవల రాయగలను నేను. అసలు కథలు రాయడంవల్లనే మీ రీ స్థితికి వచ్చారు. ఎంతసేపూ ఎవరిని వేళాకోళం చేద్దామా అనే ఉంటుంది మీ దృష్టి. లేకపోతే మీరూ మీనాక్షమ్మగారి మొగుడిలాగే ఉండేవారు."

నాకు కోపం వచ్చింది. కానీ ప్రకటించలేదు.

మరో రెండు రోజుల్లోనే నేను మీనాక్షమ్మ మొగుణ్ణి చూసి అసూయపడవలసిన అవసరం నిజంగానే వచ్చింది.

మేము అన్ని తెలుగు మాస, వార పత్రికలూ కొంటూంటాం కొన్నన్నింటిలోంచీ కథయా, సీరియల్సూ కట్ చేసి పుస్తకాలు కుడుతూంటాం. కటింగ్ శ్రీమతి వంతు. కుట్టడం నా వంతు.

అలా కుట్టుబడిన పుస్తక మొకటి మా ఇంట్లోంచి మీనాక్షమ్మగారు తీసుకెళ్ళింది. తీసుకెళ్ళిన ఆ పుస్తకం అట్ట ఆవిడ పుత్రరత్నం చేతిలో పడి నలిగి చిరిగిపోయిందిట. అందుకు మీనాక్షమ్మ మొగుడు చాలా నొచ్చుకుని—పుస్తకాని కింకో అట్టవేసి మళ్ళీ కుట్టి బైండింగ్ చేశాడుట. కుట్టేటప్పుడు ఆయన నేను కుట్టిన కుట్టు చాలా బలహీనంగా ఉందనీ అదెంతో కాలం ఉండదనీ భార్యతో అన్నాడట.

ఏది ఏమైనా మీనాక్షమ్మ మొగుడి శక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా ఆ పుస్తకం ముందు నేను కుట్టిన పుస్తకాలన్నీ వెలవెల బోతున్నాయి. మరి అసూయపడక చావనా?

ఏమనాలో తెలియక వ్యక్తి దూషణకి దిగాను. అతని రంగు నలుపన్నాను.

"మీరేమైనా తెల్లని తెలుపా?" అంది శ్రీమతి

అతన్నీ నన్నూ పోల్చడంలో నీ ఉద్దేశ్యమేమిటన్నాను.

నేనేం పోల్చలేదు, మీరే పోలుకున్నారండీ.

అయినా అంత చదువుకున్నవాడికి వేం లేకి బుద్ధులు—అన్నాను. మగవాడు వంట చేయడాన్ని గర్హించాను. పెళ్లాన్ని మరీ నెత్తి కెక్కించుకుంటే చాలా ప్రమాదమనీ—ఆ సంసారం హెచ్చిల్లదనీ ఉదాహరణలతో సహా చెప్పాను.

కానీ శ్రీమతి లాయరుగారమ్మాయి. నా పాయింట్లన్నీ ఆమె తర్కం ముందు వీగిపోయాయి. ఇంటిపనుల విషయంలో శ్రద్ధ వహించడం లేకితన మెలాగవుతుందని అడిగిందామె. సహజీవనాన్ని కోరే భార్యాభర్తల్లో అవసరాన్నిబట్టి ఎవరు వంట చేస్తేనేమందామె. ఆఖరున శ్రీమతి అన్నమాట నాకు పిడుగుపాటే. మీనాక్షమ్మగారి మొగుడు పెళ్ళాన్నేం నెత్తి కెక్కించుకోలేదు. ఆయన కాదన్నపని చేయడానికి ఆవిడ హడలిపోతుంది. ఎటొచ్చీ మగవాడుగా ఆయన వ్యవహార దక్షతను మాత్రమే మీకు తెలియచేశాను."


అప్పటికి నాకు బుద్ధివచ్చింది. అసూయ

నన్నెంతకు దిగజార్చిందో అర్థమయింది. వ్యక్తి దూషణ అల్పులు చేయవలసినపని. అయినా తనకు తానై మీనాక్షమ్మ మొగుడు నాకు చేసిన అపకారమేమీ లేదు. పైగా పాపం నేను కనబడ్డప్పుడల్లా ఆప్యాయత వొలకబోస్తూ నవ్వుతూంటాడు ఆఫీసులో.

కానీ ఎంత నిగ్రహించుకుందామన్నా నా వల్ల కావడంలేదు. మీనాక్షమ్మ మొగుణ్ణి చూసినప్పుడల్లా నా ఒళ్ళు కంపరమెత్తి పోతోంది. ఆఫీసులో సాధ్యమైనంత వరకూ అతన్ని తప్పించుకుని తిరుగుతున్నాను. కనబడ్డప్పుడు తప్పనిసరి అయితే తప్ప. నవ్వడం మానేశాను. నాలోని ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనపడకుండా ఉండడానికి తగినంత జాగ్రత్త తీసుకున్నాను. ఎంతలేదన్నా ఎంతోకొంత సంస్కారమేడిసింది కదామరి-

నా సంగతి ఇలా ఉండగా నా శ్రీమతి కతన్ని గురించి ఇంకా ఇంకా వివరాలు లభించేస్తున్నాయి. అతగాడు చేసే పనులన్నీ కూడా నాకు అసాధ్యమైనవి. నేర్చుకుందామన్నా కుతూహలంలేనివి.

ఆడవాళ్ళు కొంతమంది కలిసి ఒక రోజు సినిమా ప్రోగ్రాం పెట్టుకున్న రోజున మీనాక్షమ్మ టైము చూసుకోకుండా జంతికలు వేయడానికి స్థిరపడింది. తీరా



## ప్రమిదలు - సమిధలు

పేరు ప్రమిదకు
బాధ సమిధకు
శ్రమజీవుల రక్త తైలంతో
సామాన్యుని సమిధగా చేసి
వాని ఆకలి మంటతో వెలిగిస్తారు
వారి నల్ల డబ్బుకు
వెలుగు యోగం కలిగిస్తారు
ప్రమిదల్లాటి పెద్దలు
సమిధలు సహనాన్ని కోల్పోతే
ప్రభంజనాలై విజృంభిస్తే
రాబందుల్లా రాలిపోతారు
ప్రమిదలు పగిలిపోతాయి
అదే ఈ పోరాటానికి అంతం.

—"ఓంకార్"

మొదలెట్టబోయే సరికి ప్రైమయిపోయిందని తెలిసింది. అప్పుడు మొగుడావిడ కభయ హస్తాన్నిచ్చి ఆవిణ్ని పంపించేసి తను జంతికలు వేసేశాడు.

ఈ వార్త నన్ను నిశ్చేష్టుణ్ని చేసింది. మగవాడికి జంతికలు వేయడమన్నది సామాన్యమైన విషయంకాదు. ఒక వంక గొట్టాలని నొక్కుతూ, మరోవంక గొట్టం మెత్తాన్ని తిప్పుతూ చక్కని ఆకారంలో జంతికలు వేయాలి. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరిగే భూమి ప్రజ్ఞకు ఇదేమీ తీసిపోదు.

మొట్టమొదటిసారిగా యిన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఫీలయ్యాను నేను. అప్పుడే నన్ను మరో విషయం బాధించింది - నా భార్య దృష్టిలో నేను అల్పుణ్ని. మీనాక్షమ్మ మొగుడు అధికుడు. వచ్చే జన్మలో తనకలాంటి మొగుడు రావాలని అంతరాంతరాల్లో ఆమె కోరుకుంటున్నదేమో—ఒక భారతీయుడిగా ఈ విషయాన్ని నేను ఆమోదించలేను.

అదీగాక నా భార్య దృష్టిలో నా స్థానం పెరగాలి. అందుకోసమని నేను నన్ను మీనాక్షమ్మ మొగుడితో పోల్చుకోవడం ప్రారంభించాను.

మరీ పొడగరి కాకపోయిన మీనాక్షమ్మ మొగుడు నా కంటె పొడుగే. అతగాడు మీసాలను అందంగా కట్ చేసుకుంటాడు. భౌతికంగా అతనిలో కనిపించే ప్రత్యేకతలు ఇవేనని గుర్తించాను నేను. అయితే పాతికేళ్ళు దాటిపోయేక పొడుగు అవడం కష్టంగదా- ఆ మార్పు నేను సాధించలేనిది. మీసాలుంచుకోవడం నాకు బోరు. మీసాలు లేకపోవడం వల్లనే నా షేవింగుకు పది నిముషాలు కూడా పట్టదు. మీసాలు పెంచడం మొదలుపెట్టి ఆ సౌఖ్యాన్ని కాలదన్ను దల్చుకోలేదు నేను.

అయితే ఏం చేయాలి?

వెంటనే సమాధానం తోచలేదు. కానీ ఏదో చేసి తీరాలని మాత్రం గ్రహించాను. ఎందుకంటే శ్రీమతిలో ఇటీవల నా పట్ల దారుణంగా అసంతృప్తి పెరిగిపోయింది. ఏ విషయానికీ నన్నూ నా సమస్యలనూ అర్థం చేసుకోవడం మానేసింది. ప్రతి దానికీ మీనాక్షమ్మ మొగుడయితేనా అంటూంటుంది. అన్నింటి కంటె నన్ను

బాధించేది ఈ పోలికే!

చిట్టచివరకు నాకు ఒకే ఒక ఉపాయం కనిపించింది. అదేమిటంటే మీనాక్షమ్మ మొగుడి దగ్గరకు స్వయంగా వెళ్ళి గీతోపదేశాన్ని పొందడం. ముఖ్యంగా ఆయన ఎప్పుడు ఏ పరిస్థితుల్లో వంట, వడ్రంగం నేర్చుకున్నాడో తెలుసుకోవాలి. వాటిలో ప్రావీణ్యత సంపాదించే అవకాశం నాకున్నదో లేదో తెలుసుకోవాలి ...


ఆడవాళ్ళ మనస్తత్వం గురించి నాకింకా బాగా అర్థం కాలేదనీ, అవే నా కష్టాలకు అసలు కారణమనీ అప్పటికి నా కింకా అర్థం కాలేదు. ఆ విధంగా చూస్తే మీనాక్షమ్మ మొగుడి దగ్గర నేను గీతోపదేశం పొందాననే చెప్పాలి.

ఒకరోజు సాయంత్రం ఆడవాళ్ళందరూ లేడీస్ క్లబ్‌లో సమావేశమైన సందర్భంలో నేను నా పుత్రరత్నాన్ని ఎత్తుకుని మీనాక్షమ్మ ఇంటికి బయల్దేరాను. నేను వెళ్ళేసరికి మీనాక్షమ్మ మొగుడు చంకలో పిల్లాడి నెత్తుకుని ఇంటి తలుపు. తాళం వేస్తున్నాడు. అరే ఒక్క నిముష మాలశ్యమైతే ఎంత ప్రమాదమయ్యేది___ అనుకుంటూ పలకరించానతన్ని.

నన్ను చూస్తూనే అతని ముఖం వికసించింది. అతను మళ్ళీ తాళం తీసి “రండి రండి. నేను బయల్దేరుతున్నది మీ ఇంటికే మీరే వచ్చేశారు-” అన్నాడు.

ఆశ్చర్యపోతూ నేను లోపల అడుగు పెట్టి “మా ఇంటికే బయల్దేరారా ఏమిటి విశేషం?” అనడిగాను.

“కూర్చోండి చెబుతాను. మీతో చాలా మాట్లాడాలి___”



“నీ నిర్ణయం గట్టిదే కనుక నేను మార్చలేను ప్రమీలా!! ఐతే ఆ తాడు గట్టిదికాదని నా అనుమానం!!’’

ఇద్దరం కూర్చున్నాము. మా కుర్రాళ్ళిద్దరూ ఆటల్లోపడ్డారు.

“మిమ్మల్ని నేను చాలా విషయాలడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను. కానీ ముందుగా ఇది చెప్పండి. మీరు కథలు ఎలా రాస్తారు? నేను కథలురాయడం మొదలుపెట్టాలంటే ఏంచేయాలి?”

ఇదీ మీనాక్షమ్మ మొగుడిప్రశ్న!

* * *

కాబట్టి___పొరుగింటి మీనాక్షమ్మలవల్ల బాధపడే భర్తలూ ___ మీనాక్షమ్మ అంటూ పొరుగున ఉండాలేకానీ మీ శ్రీమతి ఆ మీనాక్షమ్మకు ఏమీ తీసిపోదన్న నిజాన్ని గ్రహించండి. మీ శ్రీమతిచేసే పరపురుష స్తోత్రానికి కారణం ఆమెకు మీ పట్లగల అసంతృప్తికాదనీ అది మగువల మనస్తత్వమనీ గ్రహించండి. అందుకు విరుగుడు కావాలంటే మీరూ ఓ పక్కింటి పంకజాక్షిని ఎన్నుకుని స్తోత్రం ప్రారంభించండి. ఈ విరుగుడు తప్పక పనిచేస్తుందని అనుభవం మీద చెబుతున్నాను. ***